సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 21 । జూలై । 2024



పాఠశాలల్లో శిక్ష సప్తాహ్

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం నుంచి వారోత్సవాలు నిర్వహించనున్నారు. -8లో



విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ రమణ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.600	రూ.660
రెండోరకం	రూ.500	రూ.580



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 890 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	260	450
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 124.180 కిలోలు

న్యూస్‌రీల్

నేడు బీడీ కార్మికుల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కార్మిక భవన్‌లో ఈనెల 21వ తేదీన ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం కడపలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యలను చర్చించడం కోసం బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం కర్నూల్ లోని కార్మిక కర్షక భవన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శశికళ, వెంకటసుబ్బమ్మ ఫరీదా బేగం రేష్మ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లి: కౌలు రైతులు ప్రతి ఒక్కరూ సీసీఆర్‌సీ కార్డులను తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఈ కార్డులు కలిగి ఉన్న కౌలు రైతులు కూడా ఇతర రైతుల లాగానే ప్రభుత్వ పథకాలకు అర్హత పొందుతారని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి (జేడీఏ) చంద్రనాయక్ పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి సమీపంలోని వ్యవసాయ సిబ్బందితో ఆయన కోనంపేట రైతు సేవా కేంద్రంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు ఆచరించాలన్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న అన్ని పంటలకు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. అవసరమైన మేరకే ఎరువులు, పురుగు మందులు ఉపయోగించాలన్నారు. లక్కిరెడ్డిపల్లి మండల వ్యవసాయ అధికారి కె.రమేష్ బాబు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి చంద్రనాయక్

గాలివీడు: భూసార పరీక్షలతో వ్యవసాయంలో పెట్టుబడి వ్యయం తగ్గించి, దిగుబడులను గణనీయంగా పెంచుకోవచ్చని అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏఓ మురళీధర్ ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తమ భూములలో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మట్టి పరీక్షలు చేయించుకుంటే సూక్ష్మ, స్థూల పోషకాల లభ్యతను తెలుసుకోవచ్చన్నారు.

లక్ష్యం నెరవేరేనా!



- ప్రారంభ దశలో వాటర్ గ్రిడ్ పథకం
- క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే పూర్తి
- ఐదు నియోజకవర్గాల్లో రూ.1,825.69 కోట్లతో పనులు
- 13.94 లక్షల జనాభాకు 3.37 టీఎంసీల కృష్ణా జలాలు
- గండికోట ప్రాజెక్టు నుంచి పైప్‌లైన్ ద్వారా జలాల తరలింపు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన మహత్తర పథకం




వాటర్‌గ్రిడ్ పైప్‌లైన్ సర్వే (ఫైల్)

బి.కొత్తకోట: అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వాటర్ గ్రిడ్ పథకంపై టీడీపీ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. దశాబ్దాలుగా గ్రామీణులు ఎదుర్కొంటున్న ఫ్లోరైడ్ సమస్య దూరం చేసేందుకు ఈ పథకానికి రూపకల్పన జరిగింది. నూతన ప్రభుత్వం యథాతథంగా పనులు ప్రారంభిస్తుందా.. 2014లో కండలేరు నీటి పథకాన్ని రద్దు చేసినట్లు.. ఈ గ్రిడ్‌పైనా నిర్ణయం తీసుకుంటుందా అనే అంశంపై తీవ్రంగా చర్చ సాగుతోంది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో టెండర్ల నిర్వహణ, పనుల అప్పగింత, క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో వాటర్ గ్రిడ్ పథకం పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా సముద్ర మట్టానికి 200 మీటర్ల ఎత్తులోని గండి జలాశయం నుంచి 664 మీటర్ల ఎత్తులోని మామిళ్లవారిపల్లెకు కృష్ణా జలాలను ఎత్తిపోసే ప్రత్యేకమైన పథకం ఇది. వైఎస్సార్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు తరలించి నీటి శుద్ధీకరణ చేసి ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించే ఈ పథకాన్ని అన్నమయ్య జిల్లాలోని నాలుగు, చిత్తూరు జిల్లాలోని ఒక నియోజకవర్గంలో అమలు చేసేందుకు 2020లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2,400 కోట్లు మంజూరు చేసింది. 2023లో టెండర్లు నిర్వహించగా అంచనాకు మించి రూ.1,901.76 కోట్లకు టెండర్ దాఖలు కాగా రివర్స్ టెండరింగ్‌లో రూ.1,825.68 కోట్లకు టెండర్ దాఖలై ప్రభుత్వానికి రూ.76.08 కోట్లు ఆదా అయింది. ఈ కంపెనీకి టెండర్ ఖరారు చేయడంతో ఒప్పంద ప్రక్రియ అప్పట్లోనే పూర్తయింది.

ఇదీ స్వరూపం

- మండలాలు : 27
- పల్లెలు : 5,336
- జనాభా : 13,94,757
- మున్సిపాలిటీలు : మదనపల్లె, బి.కొత్తకోట, పుంగనూరు, రాయచోటి
- ప్రధాన పైప్‌లైన్ : 515 కి.మీ
- నీటి సరఫరా పైప్‌లైన్ : 2,981 కి.మీ
- ట్యాంకుల నిర్మాణానికి ఖర్చు: రూ.454 కోట్లు
- ప్రధాన పైప్‌లైన్ ఖర్చు : రూ.1,000 కోట్లు
- మొత్తం నిర్మాణ వ్యయం: రూ.1,825.68 కోట్లు



గండికోట నుంచి..

గండికోట జలాశయం నుంచి కృష్ణా నీటిని పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, పులివెందుల, గండి మండలాలు, రాయచోటి నియోజకవర్గంలోని వెలిగల్లు, కొర్లకుంట, నూలివీడు, గాలివీడు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పెద్దమండ్యం, కలిచర్ల మీదుగా పీలేరు నియోజకవర్గం గుర్రంకొండ మండలంలోని మామిళ్లవారిపల్లెలో నిర్మించే ట్రీట్‌మెంట్ ప్లాంటుకు నేరుగా పైప్‌లైన్ ద్వారా నీటిని తరలిస్తారు. ఐదు నియోజకవర్గాలకు చెందిన 27 మండలాలకు పైప్‌లైన్ ప్రధాన, సరఫరా మార్గాలను నిర్ణయించారు. మామిళ్లవారిపల్లె నుంచి ప్రధాన పైప్‌లైన్ తంబళ్లపల్లె మండలంలోని కోటకొండకు, ఇక్కడి నుంచి రెండుగా కుడివైపు తంబళ్లపల్లె, ఎడమవైపు కురబలకోట మండలం ముదివేడు మీదుగా అంగళ్లుకు ప్రధాన పైప్‌లైన్ నిర్మిస్తారు. అంగళ్లు నుంచి కుడివైపున బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం మండలాలకు, ఎడమవైపు అమ్మచెరువుమిట్ట నుంచి మదనపల్లె బైపాస్‌మీదుగా గంగమ్మగుడి మీదుగా చిత్తూరు జిల్లాలోని పుంగనూరుకు పైప్‌లైన్ నిర్మాణం జరుగుతుంది. పుంగనూరు నుంచి రామసముద్రం, సోమల మండలాలకు పైప్‌లైన్ వేస్తారు. గంగమ్మగుడి నుంచి నిమ్మనపల్లె, చౌడేపల్లె మండలాలకు, మామిళ్లవారిపల్లె శుద్ధికేంద్రం నుంచి తుస్సావాండ్లపల్లె మీదుగా పెద్దమండ్యం మండలానికి పైప్‌లైన్‌ల నిర్మాణం జరుగుతుంది. ముదివేడు నుంచి మదనపల్లె మండలానికి, మామిళ్లవారిపల్లె నుంచి గుర్రంకొండ, కలకడ, పీలేరు మండలాలకు, గుర్రంకొండ మండలం తరిగొండ నుంచి వాయల్పాడుకు పైప్‌లైన్ నిర్మిస్తారు. కేవీపల్లె మండలంలో ఇప్పటికే తాగునీటి పథకం అమలులో ఉన్నందున వాటర్‌గ్రిడ్‌ను దీనికి అనుసంధానిస్తారు. ఈ ప్రధాన పైప్‌లైన్ పనులయ్యాక గ్రామాలకు పైప్‌లైన్ పనులు చేపడతారు.

ప్రభుత్వానికి నివేదించాం



వాటర్‌గ్రిడ్ పనుల సర్వే పూర్తయి, సమగ్ర నిర్మాణ నివేదిక ప్రభుత్వానికి పంపగా, మళ్లీ మార్పులు కోరడంతో కొత్త వివరాలతో ఇటీవల నివేదించాం. దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభించగానే పనులు ప్రారంభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.

–పి.వి.ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి

వైఎస్సార్, అన్నమయ్య జాయింట్ కలెక్టర్లు బదిలీ



అదితి సింగ్

కడప కార్పొరేషన్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లతో పాటు కడప నగరపాలక సంస్థ కమిషనర్ బదిలీ అయ్యారు. వైఎస్సార్ జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న అదితి సింగ్‌ను నియమించారు.

అన్నమయ్య జేసీగా ఆదర్శ రాజేంద్రన్



ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి: అన్నమయ్య జిల్లా జేసీగా పనిచేస్తున్న ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శ్రీకాకుళం జేసీగా వెళ్లారు. ఆయన స్థానంలో విజయవాడలోని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓగా పనిచేస్తున్న ఆదర్శ రాజేంద్రన్‌ను నియమించారు.

రాజంపేట సబ్‌కలెక్టర్‌గా వైఖోమ్ నిదియా దేవి, మదనపల్లెకు మేఘా స్వరూప్



వైఖోమ్ నిదియాదేవి



మేఘాస్వరూప్

రాజంపేట/మదనపల్లె: రాజంపేట సబ్‌కలెక్టర్‌గా వైఖోమ్ నిదియా దేవి నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓగా పనిచేస్తున్నారు. ఈమె స్వస్థలం మణిపూర్ కావడం గమనార్హం. అనంతపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈమె భర్త మేఘాస్వరూప్‌ను మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటు అయిన తర్వాత మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు ఆర్డీఓలే బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.

కడప కమిషనర్‌గా తేజ్ భరత్



తేజ్‌భరత్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న జీఎస్ఎస్ ప్రవీణ్ చంద్‌ను సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. ఆయన స్థానంలో తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌ను నియమించారు.

కమనీయం.. సౌమ్యనాథుడి కల్యాణం

- హరినామస్మరణలతో పులకించిన సౌమ్యనాథస్వామి ఆలయం



ముత్యాల తలంబ్రాలు తీసుకు వస్తున్న ఆకేపాటి



సౌమ్యనాథుని కల్యాణంలో మాంగళ్యం చూపుతున్న అర్చకులు



కల్యాణానికి హాజరైన భక్తులు

నందలూరు: సౌమ్యనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణం చూచువారలకు చూడ ముచ్చటగా అన్న విధంగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో వేదికను అలంకరించారు. ఆలయ అర్చకులు సునీల్ సుమార్ శర్మ బృందంచే శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలకు ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కల్యాణ వేదికపై ఆశీనులు చేశారు. పండితుల మంత్రోచ్ఛారణలు, పసుపులేటి శంకర్ వ్యాఖ్యానం, భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగళ్య ధారణ, ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఆర్టీసీ మాజీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, రాజంపేట ఆర్డీఓ మోహన్ రావు, టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రముఖ నటుడు, దర్శకులు తోట వేణుగోపాల్ హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయలసీమ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అరుణ్, జాహ్నవిదర్, కుమార్, శ్రీనివాసరావు, నరసింహులు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. డీఎస్పీ వీఎన్‌కె చైతన్య, మన్నూరు సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యాంరాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు. కల్యాణ మహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి మాఢవీధులలో విహరించారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామి గజ వాహనంపై ఊరేగారు. టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం వైభవంగా రథోత్సవం నిర్వహించేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేశారు.

సింహ వాహనంపై సిద్ధేశ్వరుడు



రాజంపేట: తాళ్లపాక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు శనివారం సింహవాహనంపై సిద్ధేశ్వరుడు, హనుమంతు వాహనంపై చెన్నకేశవుడు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ డీపీఏ గోపిబాబు, స్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఊంజల్‌సేవ: ఉదయం సిద్ధేశ్వరస్వామికి, చెన్నకేశవస్వామికి వేర్వేరుగా పల్లకీసేవ నిర్వహించారు. సాయంత్రం అన్నమాచార్య ధ్యానమందిరం వద్ద గల ప్రధాన వేదికపై చెన్నకేశవస్వామికి వేదపండితులు కృష్ణమూర్తి, అర్చకులు నరేష్ తదితరులు ఊంజల్‌సేవ నిర్వహించారు. పలువురు కోలాట ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు.

వినూత్న ఆలోచన .. విశిష్ట ఆవిష్కరణ

- ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్ల నమోదుకు శ్రీకారం
- సెప్టెంబర్ 15 వరకు గడువు

మదనపల్లె సిటీ: బుర్రకు పదునుపెట్టి వినూత్న ఆలోచనలతో పాఠశాల స్థాయి నుంచే సృజనాత్మక ఆలోచనలు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ పేరిట ప్రతిపాదనలు ఆహ్వానిస్తోంది. విద్యార్థులను ప్రోత్సహించి ఉపకార వేతనాలు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర శాస్త్ర, సాంకేతిక మండలి, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్తంగా మనక్ ప్రతిపాదనలు పంపేందుకు సెప్టెంబర్ 15 వరకు గడువు ఇచ్చింది.

ఏటా ప్రతిష్టాత్మకంగా...

కేంద్ర ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వశాఖ ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనక్ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ,రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఈ సరికొత్త వేదికను రూపొందించారు. దీనిలో అన్ని ప్రభుత్వ అనుబంధ విద్యా సంస్థల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు విద్యార్థుల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు. జిల్లాలో 304 ఉన్నత, 162 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. దీని కోసం 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు తరగతికి ఒకరు వంతున పాఠశాలకు ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకునే అవకాశముంది. 2008–09 నుంచి ఏటా నిర్వహించే ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్ల పాఠశాలల నుంచి ప్రాజెక్టులను ఆహ్వానిస్తున్నారు.

ప్రాజెక్టులను పంపండిలా...

www.inspireawards.gov.in వెబ్‌సైట్‌లో ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాల లాగిన్ ద్వారా ఆగస్టు 30వ తేదీలోపు పాఠశాల విద్యార్థులు వారి ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను నమోదు చేయాలి. అవార్డుకు ఎంపికైన ప్రతి విద్యార్థి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ ప్రాజెక్టును ప్రదర్శించేందుకు వీలుగా రూ.10 వేల పారితోషికం అందిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన బాల శాస్త్రవేత్తలకు రూ.25 వేల వరకు తమ ప్రాజెక్టును మెరుగుపర్చుకునేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ అదనపు నిధులు కేటాయిస్తుంది.



రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

దరఖాస్తు చేసుకునే విధానం..

తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యను పరిష్కరించేలా ఐడియా ఉండాలి. తరగతి వారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి, ఆలోచనకు అవసరమైన ప్రాజెక్టును రూపొందించాలి. విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి వివవరాలు నమోదు చేయాలి. విద్యార్థికి సంబంధించి బ్యాంకు ఖాతా నంబరు, ఆధార్ నంబర్ నమోదు చేయాలి. విద్యార్థి ప్రాజెక్టు సంక్షిప్తంగా, రాత పూర్వకంగా పొందుపర్చి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో ఎంటర్ చేయాలి. ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించి అంశాలు ఉండేలా చూసుకోవాలి. ప్రాజెక్టుల ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయి ఎంపికకు పంపిస్తారు. ఎంపికైన ప్రాజెక్టు ప్రయోగ నిమిత్తం బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు జమ చేస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 30వతేదీ వరకు గడువు ఉంది.

చక్కని అవకాశం..



విద్యార్థులు తమలోని సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ మనక్ ఒక చక్కని అవకాశం. ఈ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలి. జిల్లా నుంచి అధికంగా నామినేషన్లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లో గొప్ప శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశం లభిస్తుంది.

–శివప్రకాష్‌రెడ్డి, డీఈఓ.

సైన్సు ఉపాధ్యాయులు కీలకం



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసేలా ప్రోత్సహించాలి. ఈ అద్భుతమైన అవకాశాన్ని అందిపుచ్చుకునేలా వారిని తీర్చిదిద్దాలి. ముఖ్యంగా సైన్సు ఉపాధ్యాయులు ఎక్కువ బాధ్యత తీసుకోవాలి.

–మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్సు అధికారి

క్లుప్తంగా

త్రేత్రేశ్వరుడికి గిరి ప్రదక్షణ



త్రేతేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్త బృందం

రాజంపేట రూరల్ : శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాల కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తులు గిరి ప్రదక్షణ చేశారు. ఉదయం త్రేతేశ్వరస్వామి పడిమెట్ల వద్ద పూజలు చేశారు. బహుదా నదికి గంగా హారతి ఇచ్చారు. కామాక్షిమాత, త్రేతేశ్వరస్వామిని పల్లకిలో కొలువుంచారు. స్వామి పల్లకిని భక్తులు మోస్తూ ''హరహర మహదేవ శంభోశంకర '' అంటూ గిరి ప్రదక్షణ ప్రారంభించారు. ఆద్యంతం భక్తి గీతాలాపనతో ప్రదక్షణ కొనసాగింది. బుసినేని ఆదిలక్ష్మమ్మ సహకారంతో అన్న ప్రసాదం చేశారు. చెర్రీస్ స్కూల్ ఎండీ రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తమ బస్సులను భక్తుల సౌకర్యం కోసం రాజంపేట నుంచి నడిపారు.

కంప్యూటర్ల మొరాయింపు



కార్యాలయంలో ఎదురు చూస్తున్న ప్రజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలి పట్టణ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శనివారం కంప్యూటర్లు మొరాయించాయి. ఇంటర్నెట్ సౌకర్యం నిలిచి పోవడంతో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజలు పడిగాపులు గాయాల్సి వచ్చింది. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో వారు అసహనం వ్యక్తం చేశారు.

ఐదు ఆవులు మృతి

ఒంటిమిట్ట : మండలంలోని చింతరాజుపల్లె పంచాయతీలోనిని రెవెన్యూ భూమిలో ఐదు ఆవులు విష ద్రవం కల్గిన గ్రాసం తిని మృతి చెందాయి. వివరాల్లోకి వెళ్తే.. చేనువారిపల్లికి చెందిన మనోహర్‌నాయుడు పొలంలో నాటిన అరటి పిలకల వేరులో గడ్డిమందు, గుళికలు మందు వేశారు. శనివారం గాండ్లపల్లె రామయ్యకు చెందిన 11 ఆవుల్లో ఐదు ఆవులు మనోహర్ నాయుడు పొలంలో విషద్రవాలు వేసిన పొలంలో గడ్డి తినడంతో ఐదు ఆవులు మృతి చెందాయి. దీంతో బాధితుడు రామయ్య స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. ఒంటిమిట్ట పోలీసులు విచారణ చేపట్టారు.

జూదరుల అరెస్టు

ఒంటిమిట్ట : మండలంలోని అచ్చంపేట శివారులో పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 3190లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో శిక్ష సప్తాహ్

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్‌సిపీ-2020) ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వారోత్సవాల నిర్వహణకు సమాయత్తమవుతోంది. ఈ నెల 22వ తేదీ నుంచి 28వతేదీ వరకు 'శిక్ష సప్తాహ్' పేరుతో జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

- జాతీయ విద్యా విధానం అమలుకు నాలుగేళ్లు
- రేపటి నుంచి 28వ తేదీ వరకు వారోత్సవాలు
- తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామ్యానికి కసరత్తు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ

కడప ఎడ్యుకేషన్ : విద్యాభివృద్ధే లక్ష్యంగా 'శిక్ష సప్తాహ్' కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అప్పటివరకు ఉన్న 10+2+3 విద్యా విధానం బదులు డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ సిఫార్సుల మేరకు ఈ నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పన జరిగింది. ఈ ఎన్ఈసీ-2020లో 5+3+3+4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టగా, 2020 జూలై, 29న కేంద్రం ఆమోదించింది. ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లేలా శిక్ష సప్తాహ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు భాగస్వాములు కావాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

వారోత్సవాలు ఇలా..

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలతో ఈ నెల 22వ తేదీ నుంచి 28వతేదీ వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.

జూలై 22న సామగ్రి ప్రదర్శన

స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన నిర్వహిస్తారు. ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారుచేసిన బోధన అభ్యసన సామాగ్రిని ఈ ప్రదర్శనలో ఉంచుతారు. విద్యార్థుల తల్లితండ్రులు, స్థానిక పెద్దలు ఇందులో భాగస్వాములవుతారు.

23న పునాది అభ్యసన

ఒకటో తరగతి నుంచి బాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్య శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి అమలు చేసే విషయంలో చర్చిస్తారు.

24న క్రీడా దినోత్సవం

విద్యార్థులకు శారీరక సౌష్టవ ప్రాధాన్యం తెలిసేలా వివిధ రకాల క్రీడాంశాలపై పోటీలు నిర్వహించడం. ప్రాధాన్యతను వివరించడం.

25న సాంస్కృతిక దినోత్సవం

విద్యార్థులలో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడం. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు(ఫ్యాన్సీడ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు) నిర్వహించడం.

26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

స్కిల్, డిజిటల్ ఇనిషియేటివ్ డే పేరుతో ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతుల వారికి నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం, విద్యలో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్చించడం.

27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాల (మిషన్ లైఫ్ యాక్టివిటీస్) కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వహణ, కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై అవగాహన. బడిలో కనీసం 35 మొక్కలు నాటించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి.

28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం

విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, తల్లిదండ్రుల ఉపాధ్యాయ సంఘాల సహకారంతో పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాలలో తిథి భోజనాలు నిర్వహించడం, సహపంక్తి భోజనం చేయడం నిర్వహించాలి.



ఒంటిమిట్ట మండలం రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాల

అందరూ భాగస్వాములు కావాలి



రాష్ట్ర సమగ్ర శిక్ష జారీ చేసిన ఈ శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి. ఇందుకు సంబంధించిన ఫొటోలతో డాక్యుమెంటేషన్ చేయాలి. ఈ కార్యక్రమ నిర్వహణ, అమలుపరిచే విధి విదానాలు జారీ చేశాం.

– రామాంజనేయరెడ్డి, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్, సమగ్ర శిక్ష

మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి..



రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి పాఠశాలలో సప్త శిక్షాహ్ కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలి. జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలి.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

ఫొటోగ్రఫీ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

కడప కల్చరల్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఫొటోగ్రాఫర్లకు పోటీలు నిర్వహించనున్నట్లు ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. తమ సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఆగస్టు 18న ఆదివారం ఉదయం పది గంటలకు కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండ రామాలయ ధ్యాన మందిరంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఔత్సాహిక, వృత్తి ఫొటోగ్రాఫర్ల విభాగాలలో నిర్వహించే పోటీలలో ఒక్కొక్కరూ రెండు ఫొటోలు పోటీకి తీసుకురావచ్చన్నారు. జిల్లా పర్యాటక, వారసత్వ విశేషాలను తెలిపే 8x12 సైజు ఫొటో ఒకటి, వ్యక్తిగత సృజనాత్మకతను తెలిపే 12x18 సైజు ఫొటో మరొకటి పోటీలకు అనుమతిస్తామన్నారు. ఔత్సాహిక, వృత్తి విభాగపు ఫొటోగ్రాఫర్లలో ప్రతిభ కనబరిచిన 12మందిని గుర్తించి ఆగస్టు 19న ప్రత్యేక సభలో బహుమతులు అందజేస్తామన్నారు. ఆగస్టు 5వ తేదీలోగా ఫొటోలను పంపాలని సూచించారు. పూర్తి వివరాలకు 99662 22246 లేదా 83285 28076 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కొండూరు జనార్ధన్‌రాజు, అనంతబొట్ల వెంకట సుబ్బయ్య, చెన్నంరెడ్డి శంకర్‌రెడ్డి, వరశివరామకృష్ణ పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి

రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి

రాజంపేట టౌన్ : ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో రూ.3 లక్షల వ్యయంతో నీటి సౌకర్యం కల్పించేందుకు మేడా రామకృష్ణారెడ్డి కన్‌స్ట్రక్షన్స్ చేపట్టిన పనులను రఘునాథరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ మోటరు సరిగా పనిచేయక నీటి సరఫరా నిలిచిపోయిన విషయాన్ని వసతి గృహ అధికారిణి శోభారాణి తన దృష్టికి తీసుకువచ్చిందని, వెంటనే ఎంఆర్‌కేఆర్ సంస్థ పనులు చేపట్టిందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో వేల కోట్ల రూపాయలతో పనులు చేపట్టారన్నారు. వసతి గృహ అధికారులకు అందించే ఆహారం, చదువు విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారిణి పుత్తా శోభారాణి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పొలగిరి యోగీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, మండల కన్వీనర్ అన్నం నాగేంద్ర, తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, ఊటుకూరు రాజేష్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పొత్తిపి చంద్ర, రాజశేఖర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులకు పూజలు చేస్తున్న మేడా రఘునాథరెడ్డి

రోడ్డు ప్రమాదం కాదు.. హత్యే!

- ప్రాణాలు బలిగొన్న వివాహేతర సంబంధం
- కుట్ర కేసులో నలుగురు నిందితుల అరెస్ట్

గుర్రంకొండ : రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందారని కేసు నమోదు చేసిన పోలీసులకు విచారణలో అసలు విషయం వెలుగుచూసింది. అందరూ అనుకొన్నట్లుగా అది రోడ్డు ప్రమాదం కాదు.. హత్యే అని తేలింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సంగసముద్రం గ్రామానికి చెందిన గంటా రామకృష్ణ(48) వ్యవసాయం చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామంలో మల్లికార్జున నివాసముంటున్నాడు. తన భార్యతో వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే అనుమానంతో మల్లికార్జున.. కొన్ని రోజుల కిందట గంటా రామకృష్ణను అంతమొందించేందుకు పథకం వేశాడు. గత నెల 10వ తేదీన గుర్రంకొండలో ఎరువులు కొనుగోలు చేసి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని రామ్యకృష్ణ మృతి చెందాడు. పోలీసులు రోడ్డు ప్రమాదంగా భావించి కేసు నమోదు చేశారు. వాల్మీకిపురం సీఐ శేఖర్, గుర్రంకొండ ఎస్ఐ నాగార్జునరెడ్డిలకు అనుమానం రావడంతో విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. రామకృష్ణను చంపాలని తన స్నేహితులతో కలిసి సంగసముద్రం గ్రామానికి చెందిన ప్రకాష్, యల్లంపల్లెకు చెందిన వెంకటేష్, మామిళ్ల వారిపల్లెకు చెందిన సద్దాంహుస్సేన్‌తో కలిసి మల్లికార్జున పథకం వేశాడు. గుర్రంకొండ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న రామకృష్ణను బొలెరో వాహనంతో మల్లికార్జున ఢీకొట్టాడు. రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. విచారించిన పోలీసులు హత్య కేసులో నిందితులు నలుగురిని అరెస్టు చేసి వాల్మీకీపురం కోర్టులో హాజరుపరచినట్లు పేర్కొన్నారు.



హత్య కేసులో నిందితులను అరెస్టు చేసిన గుర్రంకొండ పోలీసులు



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ శేఖర్, ఎస్ఐ నాగార్జునరెడ్డి

చెట్టుకు ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

పుల్లంపేట : పుల్లంపేట మండలం అనంతంపల్లిలోని కోటగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద దళవాయిపల్లి గ్రామానికి చెందిన ఎస్.రామాంజనేయులురెడ్డి(31) చెట్టుకు ఉరివేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. దళవాయిపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఆంజనేయులురెడ్డికి ఇద్దరు కుమారుల సంతానం. జీవనోపాధి నిమిత్తం ఆయన సతీమణి, కుమారులు, గతంలో కువైట్‌కు వెళ్లారు. ఏడాది కిందట మృతుడి సోదరుడు, తల్లి ఇంటికి వచ్చారు. అయితే రామంజనేయులురెడ్డి కువైట్‌లో ఉండలేక ఇటీవల ఇంటికి వచ్చాడు. తన తల్లిదండ్రులు మందలిస్తారనే భయంతో శనివారం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబాన్ని పోషించాల్సిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



మృతి చెందిన రామాంజనేయులు రెడ్డి

చేనేత క్లస్టర్ వివాదాస్పద భూమి పరిశీలన



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న హ్యాండ్‌లూమ్ ఏడీ నాగరాజారావు

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 పంచాయతీ పరిధి ఎస్‌కేఆర్ నగర్‌లో చేనేత క్లస్టర్‌కు సంబంధించిన భూమిని హ్యాండ్లూమ్ ఏడీ నాగరాజారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను కలిసిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎస్‌కేఆర్ నగర్ సర్వే నెంబర్-1069లో చేనేత క్లస్టర్‌కు సంబంధించిన 2.87 ఎకరాల భూమి ఉందన్నారు. క్లస్టర్ భూమిని ఎవరైనా ఆక్రమిస్తూ క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించామన్నారు. వీవర్స్‌కు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి క్లస్టర్ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఓలు రవిప్రకాష్‌రెడ్డి, శేషగిరిరావు, ఆర్ఐ అనూరాధ, వీఆర్వోలు గౌస్‌పీర్, రజని, ఖలందర్, రామదాసు వెంకట్, నూకల పిచ్చయ్య, సి.లక్ష్మినరసయ్య పాల్గొన్నారు.

తల్లికి వందనమా... పిల్లలకు పంగనామమా

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి విమర్శ



ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : తల్లికి వందనం పథకం పేరుతో కూటమి ప్రభుత్వం పిల్లలు, వారి తల్లులకు సాయం చేయకుండా పంగనామం పెడుతోందని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి అన్నారు. మండలంలోని ఆకేపాటి ఎస్టేట్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ఆరంభంలోనే అమ్మ ఒడి పథకం పేరుతో జగనన్న తల్లి ఖాతాలో నగదు జమ చేసేవారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నేటికీ నగదు జమ చేయక పోవడంతో వారు ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో సూచించిన విధంగా నాలుగు సంవత్సరాలపాటు జగనన్న విద్యార్థి తల్లి ఖాతాకు నగదు జమ చేశారన్నారు. ప్రతి విద్యార్థికి రూ.15వేలు అందిస్తామన్న బాబుతోపాటు పవన్‌కల్యాణ్, లోకేష్ ఆర్భాటంగా ప్రచారం చేశారని, ఇపుడు ప్రతి తల్లికి రూ.15 వేలు ఇస్తామంటూ మాట మార్చి దగా చేస్తున్నారన్నారు. ఆధార్ లింక్ కోసమే జీఓ ఇచ్చామంటూ చేతులు దులుపుకొన్నారని మండిపడ్డారు. మ్యానిఫెస్టోకు కట్టుబడి ఉండకపోవడం, ఇచ్చిన మాట తప్పడం, పథకాలు అమలు చేయక పోగా ప్రశ్నించిన వారిని దబాయించడం టీడీపీ నాయకులకు ఆనవాయితీగా వస్తున్న ఆచారం అన్నారు. చిత్తశుద్ధి ఉంటే అర్హులైన కొత్త పిల్లలను చేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు అంటే అబద్దానికి నిలువుటద్దం.. అన్నారు. మారానంటున్న బాబు పథకాలను పకడ్బందీగా అమలు చేసి నిజాయితీ నిరూపించుకోవాలని కోరారు.

ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



కార్తీక్ రెడ్డి(ఫైల్)



అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు పంచాయతీ కొత్తపల్లికి చెందిన తాటిగుట్ల కార్తీక్‌రెడ్డి(21) శుక్రవారం చెన్నైలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. చెన్నై ఎస్ఆర్ఎం కళాశాలలో కార్తీక్‌రెడ్డి ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. శుక్రవారం తన అపార్ట్‌మెంట్‌లోని స్విమింగ్‌పూల్‌లో ఈత కొడుతూ అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు రామ్మోహన్‌రెడ్డి, రేణుక కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయనతోపాటు ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, సర్పంచ్ నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, నాయకులు ఉన్నారు.

వ్యవసాయ కూలీల ఆటో బోల్తా



ఆటో బోల్తా పడిన సంఘటనలో మహిళలు

కురబలకోట : వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న కూలీల ఆటో శనివారం బోల్తాపడింది. ఈ సంఘటనలో తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె కాలనీకి చెందిన ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ముదివేడు పోలీసుల కథనం మేరకు..గోపిదిన్నెకు చెందిన 12 మంది కూలీలు టమాటా పంట సాగు చేస్తున్నారు. శనివారం కురబలకోట మండలంలోని కడప క్రాస్‌కు వచ్చి తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో దాదంవారిపల్లె వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఉత్తమ్మ (55), మహిత(19), నాగేశ్వరి(18), రమణమ్మ(43), నాగలక్ష్మి (48), శంకరమ్మ(47), అలివేలమ్మ(40), పార్వతి (35) గాయపడ్డారు. వారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



లారీ కింద పడిన మృతిచెందిన ఎంహెచ్.లక్ష్మి

కడప అర్బన్ : కడప నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ లక్ష్మిదేవి(28) దుర్మరణం పాలయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. అక్కాయపల్లి-చౌటపల్లి రోడ్డులో నివాసముంటున్న నవీన్ భార్య లక్ష్మిదేవి నగర శివారులోని డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటోంది. యథాప్రకారం శిక్షణకు వచ్చిన లక్ష్మిదేవి ముగిసిన అనంతరం భర్త నవీన్ బైక్‌లో తిరిగి ఇంటికి వెళ్తోంది. ఐటీసీ రోడ్డులో వేగంగా గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొనడంతో అదుపు తప్పి లారీ కింద పడిన లక్ష్మిదేవి అక్కడికక్కడే మృతిచెందారు. రిమ్స్ సీఐ కె.రామచంద్ర ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణ విచారణ చేపట్టారు.

డీఈవో కార్యాయంపై దాడిలో ఐదుగురిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని డీఈఓ కార్యాలయంపై దాడి సంఘటలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల కిందట పాత అర్‌జెడీపై విచారణకు ఆటంకం కలిగించేలా ఐదుగురు ఘర్షణకు దిగి దాడి చేసి, తన సెల్‌ఫోన్ పగులగొట్టారని బాధిత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో సుండుపల్లి ఎంఈఓ వెంకటేష్‌నాయక్, ఉపాధ్యాయులు గద్దం ఆదినారాయణ రెడ్డి, నాగమునిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, రామకృష్ణలపై కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అనారోగ్యంతో మహిళ ఆత్మహత్యయత్యానికి పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రాచవేటివారిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య రామకృష్ణమ్మ(65) గత మూడు నెలలుగా కడుపునొప్పితో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందింది. అయినా పరిస్థితి మెరుగుపడకపోగా శనివారం మరోసారి కడుపు నొప్పి తీవ్రం కాగా భరించలేక ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యు లు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తల్లిపై బ్లేడ్‌తో కుమారుడి దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని రాజారెడ్డి వీధిలో నివాసముంటున్న కొండమ్మపై ఆమె కుమారుడు రాకేష్ బ్లేడ్‌తో దాడి చేయడంతో చేతికి గాయమైంది. తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కుమారుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

కడప అర్బన్ : కడప నగరంలోని పుత్తా ఎస్టేట్స్ వద్ద దారుణ హత్యకు గురైన చింపిరి వెంకటేష్ కేసులో సాదిక్‌వలి అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

విద్యుత్తు ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

రైల్వేకోడూరు అర్బన్ : విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, కొందరు నిర్లక్ష్యంగా ఉండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ రమణ తెలిపారు. మండలంలోని వివికంద్రిక, గుండాలపల్లి 33/11 సబ్ స్టేషన్లను శనివారం ఆయన పరిశీలించి వినియోగదారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తును భూతంలా చూసి జాగ్రత్త వహించాలని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు విద్యుత్తు పనులపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ రాజశేఖర్‌రెడ్డి, డీఈ భాస్కర్ రావు, యోగానంద, చలపతి, కిరణ్, తదతరులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ రమణ

కేజీబీవీలో నలుగురు సస్పెన్షన్

కురబలకోట : కురబలకోట మండలం ముదివేడు దగ్గరున్న కేజీబీవీ (కస్తూరిభా గాంధీ బాలికల రెసిడెన్సియల్ స్కూల్) ప్రిన్సిపల్ రఫియాపర్వీన్‌తోపాటు హిందీ టీచర్ గౌషియామస్తానీ, ఏఎన్ఎం భానుప్రియ, అకౌంటెంట్ రత్నప్రియను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఉత్తర్వులు జారీ చేశారు. మూడు రోజుల కిందట ఆ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థినులు హర్షిత, ఎస్.సంజన, రెడ్డి జాహ్నవి పారాసిట్‌మాల్ మాత్రలు వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. మదనపల్లె ఆర్డీఓ హరిప్రసాద్, డీఈఓ శివప్రకాష్‌రెడ్డి కేజీబీవీ విద్యార్థులను విచారించి నివేదిక ఉన్నతాధికారులకు పంపారు. విద్యార్థినులను ప్రభుత్వ ఆసుపత్రికి ఒకరోజు ఆలస్యంగా చేర్చడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. ముగ్గురు విద్యార్థినులు చనిపోవాలకునేంత స్థాయికి వెళ్లి మాత్రలు మింగే పరిస్థితిని ముందుగా పసిగట్టకపోవడం బాధ్యతారాహిత్యంగా భావించి వారిపై సస్పెన్స్ వేటు వేసినట్లు అధికారులు తెలిపారు.



కేజీబీవీ విద్యార్థులను విచారిస్తున్న ఆర్డీఓ, డీఈఓ (ఫైల్)

ఎనిమిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సుండుపల్లె : సానిపాయ అటవీ ప్రాంతంలో ఎనిమిది ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకుని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. ఆర్ఐ(ఆపరేషన్స్) సురేష్ కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం.. అటవీ సిబ్బందితో కలిసి సానిపాయ అటవీ ప్రాంతంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. రాయవరం మీదుగా ఆవుల దారి, సరస్వతీ కటువ, ముడుంపాడు అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ జరుపుతుండగా, కొందరు ఎర్రచందనం దుంగలు మోస్తూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని చూసి దుంగలను పడవేసి పారిపోయారు. తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలై జిల్లా వీరప్ప నూరు పంచాయతీకి చెందిన రమేష్(32)ను పట్టుకుని, ఎనిమిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితుడు, దుంగలు